క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


ప్రశాంత్ (ఫైల్)

మీర్‌పేట: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చారకొండ మండలం గైరాన్‌తండాకు చెం దిన వద్యావత్ శివరాం కుమారుడు ప్రశాంత్ (20) హస్తినాపురంలో స్నేహితులతో కలిసి ఉంటూ బడంగ్‌పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితుడి పుట్టినరోజు కావడంతో సోమవారం రాత్రి బీఎన్‌రెడ్డినగర్‌కు వెళ్లి మద్యం తాగాడు. అర్ధరాత్రి 3 గంటల ప్రాంతంలో తన బైకుపై తిరిగి వెళ్తుండగా హస్తినాపురం శ్రీరమణ కాలనీ వద్ద ప్రమాదవశాత్తు బైకు అదుపు తప్పి ప్రశాంత్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీ సులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


శివాలయంలో కొనసాగుతున్న పనులు

పహాడీషరీఫ్: కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా మామిడిపల్లి గ్రామంలోని శివాలయంలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎడ్ల వాసుదేవారెడ్డి పర్యవేక్షణలో షెడ్డు నిర్మాణంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరిన్ని సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. కార్తీక మాసం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేసుకొని భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని వాసుదేవారెడ్డి తెలిపారు.

బీసీ గర్జనకు తరలిన బీజేపీ శ్రేణులు


శ్రీరాంకాలనీ నుంచి వెళ్తున్న నాయకులు

పహాడీషరీఫ్: ఎల్‌బీ స్టేడియంలో బీజేపీ తలపెట్టిన బీసీ గర్జన సభకు జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంకాలనీ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా హాజరవుతున్న ఈ సభకు నాయకులు శ్రీధర్‌గౌడ్, కపిల్‌గౌడ్, శాంతకుమార్, సంతోష్, నాగార్జున్, సుమిత్ తదితరులు వెళ్లారు.

ఓటర్లను బూత్‌కు తీసుకొచ్చే బాధ్యత కార్యకర్తలదే

బీఆర్‌ఎస్ నాయకులు కార్తీక్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ యువజన నాయకులు పటోళ్ల కార్తీక్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్‌కేపురంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో డివిజన్ బూత్ ఇన్‌చార్జిలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఓటరుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పథకాలు తెలియజేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఓటర్‌లను పోలింగ్ బూత్ వరకు తీసుకొచ్చే బాధ్యత కార్యకర్తలదేనన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, సాజిద్, రామ్, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లల కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 27, వంకాయ 13, బెండ 28, పచ్చిమిర్చి35, కాకర 23, బీర 23, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 11, క్యారెట్ 31. దొండ 13, ఆలు 21, ఉల్లి 35, గోకర 28, దోస 13, సొర 09, పొట్ల 13, అరటి 10, చిక్కుడు 65, ఆర్వి 35, మునగ 85, చిలగడదుంప 35, బీట్‌రూట్ 25, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 35. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కారు ప్రచార హోరు

- ప్రచారం ముమ్మరం చేసిన బీఆర్‌ఎస్ నాయకులు
- చేరికలతో నేతల బిజీ బిజీ
- సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి: మంత్రి సబితారెడ్డి


మహేశ్వరం: సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు


మహేశ్వరం: అనితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

బడంగ్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌ల్లో కారు ప్రచారం జోరందుకుంది. బడంగ్‌పేటలోని 30వ డివిజన్‌లోని రోమా–2,3,4, ఎంసీఆర్, అశంగారిరెడ్డి కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ భీమిడి స్వప్న ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లో ఇప్పటికి వరకు రూ.30 కోట్ల నిధులతో రోడ్లు, డ్రైనేజీలు, వైకుంఠధామాలు, బట్టిల్‌గుట్ట సుందరీకరణ, మిషన్ భగీరథ నీరు తదితర అభివృద్ధి పనులు మంత్రి సబితారెడ్డి ఆధ్వర్యంలో జరిగాయని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి సబితను మారోమారు గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జంగారెడ్డి, బాబు, డానియల్, మహేందర్‌రెడ్డి, సురేష్, మూర్తి మహిళలు పాల్గొన్నారు.

23వ డివిజన్‌లో..

ఎస్‌బీఆర్, లక్ష్మీనగర్, ద్వారకాహిల్స్, వైష్ణవి కాలనీ, రాఘవేంద్ర కాలనీల్లో కోఆప్షన్ సభ్యురాలు, మాజీ కౌన్సిలర్ గుర్రం ప్రసన్న ఇంటింటి ప్రచారం చేశారు. వరద ముంపు సమస్యకు ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మించి శాశ్వత పరిష్కారం చూపిన మంత్రి సబితారెడ్డికి అండగా ఉండి గెలిపించాలన్నారు.

అల్మాస్‌గూడలోని..

వినాయకహిల్స్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ బోయపల్లి దీపిక గడపగడపకూ కరపత్రాలు పంచుతూ ఓటర్లను అభ్యర్థించారు. 30, 40 పీట్ల రోడ్ల అభివృద్ధి, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల అభివృద్ధి కమ్యూనిటీహాళ్లు, తాగునీరు మౌలిక సదుపాయాలకు పూర్తి సహకారం అందిస్తున్న సబితారెడ్డికి అండగా ఉంటామన్నారు.

29వ డివిజన్‌లో..

గాంధీనగర్, సబితాఇంద్రారెడ్డి నగర్ కాలనీల్లో కార్పొరేటర్ పి.శోభారెడ్డి ప్రచారం నిర్వహించారు. స్లమ్ ఏరియాగా ఉన్న గాంధీనగర్‌లో రోడ్లు లేక మొరం రాళ్లు, గుట్టలుగా ఉండి నడవలేక పోయేవాళ్లమని సబితారెడ్డి సహకారంతో సీసీరోడ్లు, ప్రభుత్వ స్కూలు బిల్డింగ్, కృష్ణావాటర్, విద్యుత్, తదితర సకల సౌకర్యాలు కల్పించి మాస్ కల్చర్‌ను తలదన్ని మధ్యతరగతి కాలనీగా మార్చిన గొప్ప నాయకురాలు సబితారెడ్డికి అండగా ఉండి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆనంద్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, యాదయ్య, వర్మ,చారి, మహిళలు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మహేశ్వరం: బీఆర్‌ఎస్‌తోనే మహేశ్వరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సామజాన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మర్యాద రాఘవేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో కాంగ్రెస్, బీజేపీల నుంచి పలువురు కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలన్నారు. మండలంలోని రావిర్యాల ఫ్యాబ్‌సిటీ(ఈ-సిటీ), మహేశ్వరం ఎల్రక్టానిక్ పార్కు, తుమ్మలూరు ప్లాస్టిక్‌పార్కులో మరిన్ని కంపెనీలు ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. మహేశ్వరం– బెంగుళూరు హైవే(స్టేషన్ తిమ్మాపూర్) వయా మన్సాన్‌పల్లి చౌరస్తా, అమీర్‌పేట్ వరకు నాలుగు వరుసల బీటీ రోడ్డు, మహేశ్వరం– ఔటర్‌రింగ్ రోడ్డు పెద్ద గోల్కొండ వయా మన్సాన్‌పల్లి చౌరస్తా వరకు నాలుగు వరుసల బీటీ రోడ్ల నిర్మాణం చేపడుతామన్నారు. ప్రతి గ్రామం, గిరిజన తండాలకు రెండు వరుసల బీటీ రోడ్లు, సీసీ రోడ్లు నిర్మాణం చేస్తామన్నారు. యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పబ్బ అంజనేయులు గౌడ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌చారి, వెంకటేశ్‌గౌడ్, కిరణ్‌రెడ్డి, కుమార్‌గౌడ్, పరమేష్ గౌడ్ పాల్గొన్నారు.

సబిత గెలుపును ఎవరు ఆపలేరు: అనితారెడ్డి

మహేశ్వరం: సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన మహేశ్వరంలో సబితమ్మ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. మహేశ్వరంలో సబితారెడ్డి గెలుపును ఎవరు ఆపలేరన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్, పార్టీ నాయకులు నర్సింహ, ముత్యం, జంగయ్య పలువురు పాల్గొన్నారు.

మంత్రికి సంక్షేమ సంఘాల మద్దతు

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం నియోజకవర్గంలో అభివృద్ధికి ఆకర్షితులై పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని సరూర్‌నగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు బోయిని మహేందర్ యాదవ్, మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డిలు అన్నారు. మంగళవారం డివిజన్‌కు చెందిన కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు స్వచ్ఛందంగా మంత్రికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కాలనీల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రతి ఇంటికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వెంకటసాయి కాలనీ అధ్యక్షుడు జగన్, అనిల్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి: సుధీర్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సరూర్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సుధీర్‌రెడ్డి కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి ఓటు అభ్యర్థించాలని కోరారు. కార్యక్రమంలో సత్యం గౌడ్, రాజశేఖర్‌గౌడ్, టింకు, శ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సబితారెడ్డికి భారీ మెజార్టీ ఖాయం

కందుకూరు: సబితారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని దాసర్లపల్లి, దాసర్లపల్లి తండాల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సబితమ్మకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు అందాయన్నారు. అలాగే, ముచ్చర్లలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బాచుపల్లి, పెరుగుగూడలో మాజీ ఎంపీపీ శోభా ఈశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ ఇందిరమ్మ దేవేందర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.మేఘనాథ్‌రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బడంగ్‌పేట: ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ స్వప్న


దాసర్లపల్లిలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ


సుధీర్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న నాయకులు

నేడు నామినేషన్ వేయనున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం: నేడు(బుధవారం) మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కార్యకర్తలు, నాయకులతో కలిసి నామినేషన్ వేయనున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉ.11 గంటల నుంచి తుక్కుగూడ కేఎల్‌ఆర్ కార్యాలయం నుంచి మహేశ్వరం గేటు వరకు భారీ ర్యాలీతో నామినేషన్ వేస్తారన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా


జరిమానా రసీదు ఇస్తున్న కమిషనర్ వాణి

మీర్‌పేట: బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ అల్లూరి వాణి హెచ్చరించారు. మంగళవారం మీర్‌పేట పెద్దచెరువు ప్రాంతంలో చెత్త వేసిన సాయికార్తీక్ అనే వ్యక్తికి కమిషనర్ వెయ్యి రూపాయాల జరిమానా విధించారు. అనంతరం రోడ్లపై, ఖాళీ స్థలాల్లో చెత్త వేయరాదని అతనికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, టీపీఓ దేవానంద్ సిబ్బంది రాము, నర్సింహ, కృష్ణ ఉన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కందుకూరు: మండలంలోని ముచ్చర్లలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, రాంచంద్రారెడ్డి, దామోదర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు నామినేషన్ల దాఖలు



మహేశ్వరం: డీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న అమరేందర్

మహేశ్వరం: మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారం ఆరుగురు అభ్యర్థులు ఒక్కొక్కరు ఒక్క సెట్ చొప్పున ఆరు నామినేషన్ సెట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూరజ్ కుమార్‌కు అందజేశారు. నామినేషన్ వేసిన వారిలో బీఎస్పీ నుంచి కొత్త మనోహర్‌రెడ్డి, ఆల్ ఇండియా మజ్లిస్ ఈ ఇన్కిలాబ్–ఈ– మిలాత్ నుంచి సయ్యద్ అజీముద్దీన్, ధర్మసమాజ్ పార్టీ నుంచి గుండ్రపల్లి అమరేందర్, శివసేన నుంచి జే.మహేష్‌కుమార్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి మల్లేష్ పిప్పాల, స్వతంత్ర అభ్యర్థిగా రామ్‌చరణ్ బట్టులు నామినేషన్లు దాఖలు చేశారు.

నామినేషన్‌కు ర్యాలీగా బీఎస్పీ అభ్యర్థి మనోహర్‌రెడ్డి

మీర్‌పేట: మహేశ్వరం బీఎస్పీ అభ్యర్థి కొత్త మనోహర్‌రెడ్డి నామినేషన్ వేసేందుకు మంగళవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి మందమల్లమ్మ చౌరస్తా నుంచి కార్యకర్తలు, అనుచరులతో తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. అంతకుముందు మనోహర్‌రెడ్డి కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజలను రెండుసార్లు మోసం చేసిన కేసీఆర్

- మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్‌ఆర్


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు పర్యాయాలు మోసం చేశాడని, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్) పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్‌లో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ సీఎం అయిన తర్వాత దళితులకు ఇస్తామన్న మూడు ఎకరాల భూమి, నిరు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మోసం చేశారని అన్నారు. తాను కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్నందు వల్లే బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కుట్ర చేసి తనను 48 గంటలు నిర్బంధించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ రేషన్ షాపులో తొమ్మిది రకాల వస్తువులు ఇస్తామన్నారు. సోనియా గాంధీ ప్రకటించిన 6 గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి పిట్ట హరినాథ్ రెడ్డి, పున్న గణేష్ నేత, చిక్కుళ్ళ శివ ప్రసాద్, సామిడి గోపాల్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, నల్లంకి ధనరాజ్ గౌడ్, బొడ్డుపల్లి మహేందర్ దితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి దండెం

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యేగా అవకాశం కల్పించండి.. సేవ చేస్తానని కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యే అభ్యర్థి దండెం రాంరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యాచారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేశానని అన్నారు. కార్యక్రమంలో ఆయన మద్దతుదారులు శేఖర్ యాదవ్, సోమయ్య, శ్రీకాంత్, అంజయ్య, దశరథ, శివ, బుగ్గరాములు, శ్రీశైలం, కృష్ణయ్య పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో భూతగాదా

ఇరువర్గాలపై కేసులు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: నాదర్‌గుల్‌లో భూతగాదాల కారణంగా జరిగిన ఘర్షణకు కారకులపై ఆదిబట్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు.. మంగళవారం నాదర్‌గుల్‌లోని ఓ వివాదస్పద భూమి వద్ద పంటను కోసుకోవడానికి వెళ్లిన కోమ్రేష్‌పై షేక్ మహమ్మద్ మనుషులు (బౌన్సర్లు) దాడి చేశారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. సమాచారం అందుకున్న పోలీసులు కోమ్రేష్‌తో పాటు మరి కొందరిపై కేసులు నమోదు చేశారు. పోలీసులు కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ అండగా నిలిచారు. రైతులకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డి వారిని సముదాయించి విచారణ చేస్తానని హామీ ఇచ్చారు.

మహిళతో అసభ్య ప్రవర్తన కేసులో..

నిందితుడికి రెండేళ్ల జైలు

ఇబ్రహీంపట్నం: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి రెండు సంవత్సరాల జైలు, రూ.5,500 జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. స్థానిక సీఐ గోవింద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పరిగూడకి చెందిన బి.వెంకటేశ్ అదే గ్రామానికి చెందిన మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన 2017లో జరగగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయస్థానం వివిధ సెక్షన్ల కింద నిందితుడు వెంకటేశ్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.5,500 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. అదేవిధంగా ఈ కేసును జిల్లా కోర్టుకు అప్పీల్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది.

ఎల్మినేడులో ధాన్యం కొనుగోలు కేంద్రం

ఇబ్రహీంపట్నం రూరల్: దళారులకు ధాన్యం అమ్మి మోసపోవొద్దని ఎంపీ పటేల్‌గూడ పీఏసీఎస్ చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్మినేడులో డీఎస్‌ఓ రాథోడ్, డీఎం విజయలక్ష్మితో కలిసి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రఘు, పాలకవర్గం సభ్యులు యాదయ్య, బాల్‌రెడ్డి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బ్రహ్మరథం

వనస్థలిపురం: ఏ కాలనీకి వెళ్లినా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే ఘన విజయమని ఆ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన మన్సూరాబాద్ డివిజన్‌లో పాదయాత్ర చేస్తూ ప్రచారం చేశారు. పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, బుడ్డ సత్యనారాయ, మిద్దెల జితేందర్ పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక


హుడాకాంప్లెక్స్: ప్రచారం చేస్తున్న నర్సింహారెడ్డి


బడంగ్‌పేట్: బీజేపీలో చేరుతున్న గ్రామస్తులు

బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం మహేశ్వరం మండలం అమీర్‌పేట గ్రామస్తులు మహేశ్వరం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ సమక్షంలో బీజేపీలో చేరారు. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అధికారంలోకి రాగానే చేపట్టే ప్రజాసంక్షేమ పథకాలను అందెల ప్రజలకు వివరించారు. మహేశ్వరం గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలంగౌడ్, పెండ్యమోని దశరథ్, యాదయ్య, నందీశ్వర్, భిక్షపతి, అంజయ్యగౌడ్, గోపాల్, బీజేపీ, బీజేవైఎం నాయకులు ఉన్నారు.

బీజేపీ నేతల ప్రచారం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ జింకలబావి కాలనీలో మంగళవారం బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిలు మహేశ్వరం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ గెలుపు కోసం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఆరుట్ల సురేష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

చిన్నారులకు ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు


శస్త్ర చికిత్స చేయించుకున్న చిన్నారులతో వైద్యులు

చైతన్యపురి: పుట్టుకతో చెవిటి, మూగ పిల్లలకు చైతన్యపురిలోని మాగ్నస్ ఈఎన్‌టీ ఆస్పత్రిలో ప్రభుత్వ ఏడీఐపీ స్కీమ్ ద్వారా కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ నిర్వహించారు. ఒక్కొక్కరికి రూ. 10 లక్షల ఖర్చు అయ్యే ఈ సర్జరీలను ఉచితంగా చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కె.ఘన (4), సూర్యాపేట జిల్లాకు చెందిన కె.ఉదయశ్రీ, (2), ఆదిలాబాద్‌కు చెందిన డి.అఖిల (2)కు మంగళవారం ఆపరేషన్ చేశారు. ఈఎన్‌టీ సర్జన్‌లు డాక్టర్ ఎస్ రవికుమార్, ఎ.సత్యకిరణ్, అనస్థీషియా వైద్యుడు జె,రవికుమార్, ఆడియాలజిస్ట్ టి.నాగకిరణ్‌లు విజయవంతంగా ఈ ఆపరేషన్‌లు పూర్తి చేశారని ఆసుపత్రి బృందం తెలిపింది. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. ఈ కాంక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ ద్వారా బధిర చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. ఎంత చిన్న వయసులో శస్త్ర చికిత్స చేస్తే అంత మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఏడీ ఐపీ ద్వారా ఉచితంగా సర్జరీలు చేయించుకోవచ్చన్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయిస్తా


మాట్లాడుతున్న రంగారెడ్డి, నిరంజన్‌రెడ్డి

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామం నుంచి పలు పార్టీలకు చెందిన 100 మంది నాయకులు మంగళవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొహెడ సమీపంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో వారు హస్తం కండువా కప్పుకున్నారు. మల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఫార్మాసిటీని రద్దుచేయిస్తానని అన్నారు. టీఎస్ఐఐసీ తీసుకున్న భూములను రైతులకే తిరిగి ఇప్పిస్తానని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు ఉన్నారు.